క్లుప్తంగా

విరిసిన బ్రహ్మకమలం


నాటిన మొక్కకు ఉన్న బ్రహ్మకమలం పుష్పం

సీతానగరం: మొక్కల పెంపకంలో ప్రావీణ్యం కలిగిన మండల కేంద్రానికి చెందిన రైతు ఆర్‌వీ పార్థసారధి ఇంట్లో అపురూపమైన అందాన్ని చ్చే బ్రహ్మకమలం పుష్పాలు విరిసింది. విశిష్టత కలిగిన బ్రహ్మకమలం మొక్కను రెండేళ్ల క్రితం ఆయన నాటగా అది పెద్దదై మూడు మూడు పుష్పాలు విరియడంతో రోడ్డుపై వెళ్లేవారంతా తిలకించి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కోట దుర్గమ్మకు సారె


ఊరేగుంపుగా సారెను తీసుకువెళ్తున్న భక్తులు, గ్రామస్తులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలం సంగంవలస గ్రామంలో వెలసిన కోట దుర్గమ్మ వారికి భక్తులు, గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం సారె సమర్పించారు. అమ్మవారిని ఊరి ఆడపడుచుగా భావించి ఆషాఢ మాసంలో ఏటా సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. ఊరి పొలిమేరల నుంచి సారె ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పాలకొండ రూరల్: పట్టణంలోని పెదకాపు వీధికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యురాలు దుప్పాడ కుమారి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ మేరకు మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పీఏసీ చైర్మన్ కొణిదల నాగబాబు చేతుల మీదుగా బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు, నాయకులు జి.లక్ష్మణ్, జానీ, ఎం.సంతోష్ పాల్గొన్నారు.

సుదర్శన హోమం

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో సుదర్శన హోమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, అభిషేకాలు తదితర పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞికర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ సహకారంతో అర్చకులు సత్తె నరసింహాచార్యులు ఆధ్వర్యంలో సుదర్శన హోమం చేశారు. ఈ హోమం చేయడం ద్వారా అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా చేసుకుందాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మణమూర్తి

గుమ్మలక్ష్మీపురం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆగస్టు 9వ తేదీన ఘనంగా నిర్వహించుకుందామని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక వైటీసీలో గిరిజన సంఘాల నాయకులంతా ఆదివారం సమావేశమై, ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై చర్చించారు. కార్యక్రమం ఎక్కడ చేపట్టాలి, ఆరోజు చేపట్టే సాంస్కృతిక ప్రదర్శనల సన్నద్ధతపై సలహాలు, సూచనలు సేకరించారు. గిరిజనులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో గిరిజన నాయకులు మండంగి భూషణరావు, ఎస్.కృష్ణబాబు, పత్తిక లక్ష్మయ్య, మండంగి రమణ, వెంపటాపు భారతి పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న జలపాతం


ఉధృతంగా ప్రవహిస్తున్న జలపాతం

సీతంపేట: ఏజెన్సీలోని మెట్టుగూడ జలపాతం వరదనీటితో పొంగిపొర్లుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారిన నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా వరదనీరు జలపాతం గుండా రావడంతో పర్యాటకులు స్నానాలు చేసేందుకు ఉత్సుకత కనబరుస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి


పార్వతీపురం టౌన్: ఎస్ఎన్ఎం కాలనీలో బాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ మజ్జి శోభా రాణి


సీతానగరం: మరిపివలస ఆలయంలో పూజలు చేయిస్తున్న అర్చకుడు డి.సురేష్


పార్వతీపురం: గంగాపురంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

గురుపౌర్ణమిని పురస్కరించుకుని పార్వతీపురం పట్టణం, పార్వతీపురం, సీతానగరం మండలాల్లోని బాబా ఆలయాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని బైపాస్ కాలనీ ఎస్ఎన్ఎం నగర్, నర్సిపురం బాబా ఆలయాల్లో ఆలయ కమిటీల పర్యవేక్షణలో ఉదయం 6గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్విఘ్నంగా పూజా కార్యక్రమాలు జరిగాయి. కాగడ హారతి ధ్వజారోహణతో ప్రారంభమైన వేడుకలు పల్లకీ సేవ, సెజ్‌హారతి, ప్రసాద వినియోగంతో ముగిశాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఎస్ఎన్ఎం నగర్ సాయిసమాజ్ ఆలయంలో జరిగిన వేడుకల్లో ఎంపీపీ మజ్జి శోభారాణి పాల్గొని బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురుపూర్ణిమ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

–సాక్షి నెట్‌వర్క్

ప్లాస్టిక్ రహిత సమాజస్థాపనకు సహకరించాలి


కూరగాయల మార్కెట్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీతానగరం: ప్లాస్టిక్ రహిత సమాజస్థాపనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఈఓపీఆర్డీ కె.కుమార వర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు సీతానగరం మండలంలో అమలు చేస్తున్న పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయన అంటిపేటలో సర్పంచ్ బి.తిరుపతిరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి శోభిభూషణరావు సిబ్బందితో కలిసి కూరగాయల మార్కెట్ వద్ద కొనుగోలు దారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్లాస్టిక్,పాలిథిన్ కవర్ల వాడకంతో వచ్చే అనర్థాలను ప్రజలు తెలుసుకోవాలని కోరారు. ఇప్పటికే బొబ్బిలిలో ప్లాస్టిక్ సంచులు, పాలిథిన్ కవర్లకు బదులు క్లాత్‌తో తయారుచేసిన సంచులను వినియోగంలోకి తేవడం వల్ల మంచి ఫలితాలువస్తున్నాయని ఇటీవల కురిసిన వర్షాల సమయంలో తెలియవచ్చిందన్నారు. అంటిపేటలో ప్లాస్టిక్ సంచులు నిషేధాన్ని అమలు చేయడానికి ముందుగా ప్రజలను చైతన్య పర్చాలని నిర్ణయించామని, గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించడం కోసం ప్రచారం చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యసేవలు అందకే మరణాలు


మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం, గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులకు సకాలంలో సరైన వైద్యం అందకపోవడంతోనే మరణాలు సంభవిస్తున్నాయని గిరిజన సంఘాల నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ, ఎం.శ్రీను, సన్యాసిలు అన్నారు. ఇదే విషయమై మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడిన వారు.. గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పరంగా అందాల్సిన వైద్యసేవలు అంతగా అందకపోవడంతోనే ఆర్‌ఎంపీలను ప్రజలు ఆశ్రయిస్తున్నారని, వారు అవసరానికి మించిన వైద్యం చేయడం వల్లే మృత్యువాత చెందుతున్నారన్నారు. కురుపాం సీహెచ్‌సీకి వచ్చిన గిరిజన రోగులను కొమరాడ మండలంలోని మాదలంగి పీహెచ్‌సీకి, లేదా రావాడ రామభద్రాపురం పీహెసీకి రిఫర్ చేస్తున్నారే తప్ప సకాలంలో సరైన వైద్యం అందించడం లేదన్నారు. పీహెచ్‌సీల్లో సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించిన మందులు కూడా అంతగా లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, గిరిజన ప్రాంతాల్లో వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు ఉన్నారు.

వృథాగా పోతున్న వరదనీరు


గుమ్మిడిగెడ్డ అక్విడెక్టు మీదుగా వృథాగా కిందికి తరలిపోతున్న వరదనీరు

కురుపాం: మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని గుమ్మిడిగెడ్డ అక్విడెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి దిగువ ప్రాంతాలకు వర్షపునీరు ప్రవహిస్తోంది. అయితే అక్విడెక్టుకు తలుపులు లేకపోవడంతో నీరు వృథాగా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్విడెక్టుకు తలుపులు ఉండి, అదే నీరు ఉండి ఉంటే తమ పంటపొలాలకు సాగునీరు అందేదని అన్నదాతలు అంటున్నారు. ఇదే గెడ్డ అక్విడెక్టు పైన మినీ రిజర్వాయరు నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వం హామీ కూడా ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించి, మినీ రిజర్వాయరు నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పోతులగెడ్డను బాగుచేయండి


కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు సమస్య తెలియజేస్తున్న రైతులు

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని పోతులగెడ్డను బాగుచేయాలని రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా ఆదివారం పాలకొండ పట్టణానికి వచ్చేసిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్ని దశాబ్దాలుగా గెడ్డలో పూడికతీతలు చేపట్టకపోవడంతో పిచ్చిమొక్కలు, పూడికలు విపరీతంగా ఉన్నాయని దీంతో సాగునీరు సాఫీగా ప్రవహించడం లేదన్నారు. ఇదే గెడ్డ ద్వారా దాదాపు 100 ఎకరాలకు సాగునీరు వెళ్తుందని, ఈ నేపథ్యంలో గెడ్డను బాగుచేస్తే అన్నదాతలకు వ్యవసాయం చేయడం సులభమవుతుందన్నారు. స్పందించిన కలెక్టర్.. తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆర్‌డీవో వెంకటరమణను ఆదేశించారు. గెడ్డను పరిశీలించి నివేదిక అందజేయాలని తెలిపారు.

చెరువుల్లా పంట పొలాలు

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారడంతో ఇటీవల మూడురోజుల పాటు భారీవర్షాలు కురిశాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు, పంట పొలాల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. ఈ క్రమంలో చాలాచోట్ల వరినాట్లు(ఉబాలు) వేసిన పొలాలు చెరువల్లా తలపిస్తున్నాయి. అయితే పొలంలో ఎక్కువసేపు నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే పంట పాడవ్వదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.


రాజుపేట వద్ద చెరువును తలపిస్తున్న పంటపొలాలు

నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తం

- విజ్ఞప్తి చేసిన అధికారులు

సీతానగరం: మండలంలోని సువర్ణముఖి నదీ తీరాన ఉన్న గ్రామాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరుతూ వీఆర్వోల ద్వారా గ్రామాల్లో తెలియజేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు చెప్పారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీనివాసరావు రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది కలసి పెదంకలాం ప్రాజెక్ట్ నుంచి బూర్జ, సీతానగరం, చినభోగిలి, తామరఖండి, బగ్గందొరవలస, లక్ష్మీపురం రేవులను కొత్తవలస ప్రాజెక్ట్ డ్యామ్ వరకూ పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఉత్తర కోస్తా జిల్లాలో వర్షాలు కురుస్తాయని తుఫాను హెచ్చరికల కేంద్రం సూచనలు, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం నదికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు నదిలో దిగవద్దని హెచ్చరించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎన్.శ్రీనివాసరావు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


బూర్జ రేవును పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

నకిలీ వైద్యులపై చర్యలు చేపట్టాలి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంతాల్లోని నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పి.సురేష్, డి.సురేష్‌లు కోరారు. చాలాచోట్ల ఎటువంటి అనుమతులు లేకుండా మెడికల్ షాపులు, క్లినిక్‌లు నిర్వహిస్తూ వైద్యం చేస్తూ మందులు అందజేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల కురుపాం మండలానికి చెందిన ఓ యువకుడు గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన ఓ క్లినిక్ నిర్వాహకుడి వైద్యం చేయడం వల్ల మరణించాడని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఐటీడీఏ పీవోగా పనిచేసిన సువర్ణపండా దాస్ నకిలీ ఆర్‌ఎంపీలపై ఉక్కుపాదం మోపారని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ నకిలీ వైద్యులు తయారయ్యారని, ఎక్కడికక్కడ వచ్చీరాని వైద్యం చేస్తూ అమాయకులైన గిరిజనుల నుంచి పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు.తక్షణమే నకిలీ వైద్యులపై చర్యలకు అధికారులు ఉపక్రమించి, ప్రజల ప్రాణాలు రక్షించాలన్నారు.

ముమ్మరంగా వరి ఉబాలు


నులకజోడు వద్ద వరినారు తీస్తున్న మహిళలు


చినగుడబలో వరి ఉబాలు వేస్తున్న మహిళా కూలీలు

భామిని: మండలంలోని నులకజోడు, బిల్లుమడ, గురండి, బొమ్మిక, కాట్రగడ-బి గ్రామాల పరిసరాల్లోని పొలాల్లో వరి ఉబాలు(వరినాట్లు వేయడం) ముమ్మరంగా జరుగుతున్నాయి. ఓ వైపు వరినారు తీత పనులు కొనసాగుతూనే మరోవైపు వరినాట్లు వేసేస్తున్నారు. అయితే వరినాట్లు వేసే ముందు నారు చివరిభాగం తొలగిస్తే పంటకు పురుగు పట్టకుండా ఉంటుందని వ్యవసాయధికారులు సూచిస్తున్నారు.

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు, ఉద్దవోలు, బీవీ పురం, గరుగుబిల్లి, గొట్టివలస, చినగుడబ, పెదగుడబ, వల్లరగుడబ గ్రామాల్లో వరి ఉబాలు వేస్తున్నారు. ఇటీవల కొన్నిరోజులుగా కురిసిన వర్షాలు వరినాట్లు వేసేందుకు అనుకూలంగా ఉండడంతో ఆయా గ్రామాల్లోని రైతులు వరినారు తీతలు వేగవంతం చేసి, వరినాట్లు వేశారు.

అప్రమత్తంగా ఉండాలి


కళ్లికోట వద్ద నాగావళి నదీతీరాన్ని పరిశీలిస్తున్న జేసీ శోభిక

కొమరాడ: వర్షాకాలం నేపథ్యంలో నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జేసీ ఎస్.ఎస్. శోభిక అన్నారు. మండలంలోని నాగావళి నదీతీర ప్రాంతమైన కళ్లికోట గ్రామానికి ఆదివారం వెళ్లిన ఆమె.. అక్కడి నదిలో వరద ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం పలు సూచనలు, సలహాలు చేశారు. వర్షాలు కురుస్తున్న కారణంగా నదీ ప్రవాహం ఉధృతంగా ఉందని, ఎవరూ నదిలోకి దిగవద్దన్నారు. అలాగే ఎప్పటికప్పుడు గ్రామ సచివాలయ సిబ్బంది వరద పరిస్థితులను పర్యవేక్షించి, ప్రజలకు తెలియజేయాలని, అవసరమైతే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో మల్లేకార్జునరావు, ఆర్‌ఐ శ్రీనివాసురావు, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొమరాడ: మండలంలోని కూనేరుకు చెందిన కరకవలస రామ్మోహన్‌రావు, తుమ్మలవలస గ్రామానికి చెందిన ఊయక బాలాజీలు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆదివారం వారి గ్రామాలకు వెళ్లి, బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించారు. అనంతరం మృతుల మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆమె వెంట పార్టీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన్‌రావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, నాయకులు మరడాన సూరపునాయుడు, బోడి ఆనంద్, తొడుము సర్పంచ్ యేగిరెడ్డి సింహాచలం తదితరులు ఉన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకుడు సాంబమూర్తి, తదతరులు

కొమరాడ: భూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 29వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహణకు సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్‌లను మండలంలోని గుమడ సంత వద్ద సీఐటీయూ నాయకుడు కొల్లు సాంబమూర్తి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం–2006 ప్రకారం ప్రతీ గిరిజన రైతుకు 10 ఎకరాల పోడుభూమి ఇవ్వాలని ఉన్నా.. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దఎత్తున భూములు భూస్వాముల చేతుల్లో ఉండిపోవడంతో నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. గిరిజన హక్కులను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

భామిని: మండలంలోని వంశధార నదీతీర ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఆదివారం ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు లివిరి, తాలాడ, సింగిడి గ్రామాల్లోని నదీతీరాల్లో ఈ బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో వరదల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ వీటిని ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు అన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు చిన్నారావు, శంకరరావు, వినోద్‌కుమార్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని బాసంగి దగ్గర నాగావళి నదీతీరాన ప్రమాద హెచ్చరిక బోర్డును తహసీల్దార్ సీతారామయ్య ఆదివారం ఏర్పాటు చేయించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఈ బోర్డు పెట్టినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నదుల్లో వరద ప్రవాహం ఉధృతంగా ఉందని, పిల్లలను నదుల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు.


లివిరి నదీతీరం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ శాఖ అధికారులు


జియ్యమ్మవలస: బాసంగి వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు వద్ద తహసీల్దార్ సీతారామయ్య

వ్యవ‘సాయం’ ఏది బాబు..?

- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ
- ఖరీఫ్ పనులు జరుగుతున్నా ప్రకటన చేయని ప్రభుత్వం
- రైతుకు తప్పని ఎదురుచూపులు

రామభద్రపురం: అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు ఖరీఫ్ సాగు పనులను ముమ్మరం చేశారు. ఇప్పటికే మొక్కజొన్న, పత్తి, చెరకు, కూరగాయలు తదితర పంటలను 1033 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. అయితే దుక్కి పనులు, విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు, వరినాట్లు వేసేందుకు పెట్టుబడి సాయం అవసరం. గత ఐదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన పెట్టుబడి సాయం అన్నదాతలకు ఎంతగానో ఉపయోగపడింది. ఏటా కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రూ.7,500ను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో క్రమం తప్పకుండా జమచేశాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తొలివిడత సాయం కింద రూ.2 వేలు మాత్రమే వేయగా, ఏడాదికి రూ.20 వేలను సాగుకు సాయంగా అందిస్తామని కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించినా అది ఇంకా అమలు చేయకపోవడంతో రైతుకు ఎదురుచూపులు తప్పడం లేదు.

రెండోసారి సమావేశమైనా..

ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్‌లతో రెండోసారి కేబినెట్ సమావేశం జరిగినా రైతులకు ఇస్తామన్న సాయంపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం రైతాంగాన్ని కలవరానికి గురిచేస్తోంది. రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకూడదనే సదుద్దేశ్యంతో గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏటా రైతు భరోసా పథకం కింద ఇచ్చిన పెట్టుబడి సాయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. అప్పటి ప్రభుత్వమే మంచిదని, ఏటా క్రమం తప్పకుండా ఇచ్చిన మాట ప్రకారం చెప్పిన తేదీకి డబ్బులు వేసేదని అన్నదాతలు అంటున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.


నాయుడువలసలో నాగలి సాయంతో దున్నుతున్న రైతు